సాక్షి
నల్లగొండ
ఆదివారం : 28 : మే : 2023



'ఎన్జీ'లో కొత్తగా డిగ్రీ కోర్సులు
నల్లగొండ ఎన్జీ కళాశాలలో కొత్తగా రెండు డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ తెలిపారు. - 8లో



క్రీడల్లో రాణించాలి
విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ సూచించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 41°/27°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోతె పిచ్చిరెడ్డి పదవీకాలం పొడిగింపు



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న మంత్రి

నల్లగొండ అగ్రికల్చర్: ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి పదవీకాలాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కృత్రిమ గర్భధారణతో పాటు పాడి ఉత్పత్తి పెంపునకు చేస్తున్న కృషికి గాను ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. ఈ మేరకు శనివారం నల్లగొండలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డికి ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పాడి ఉత్పత్తి పెంపునకు మరింతగా కృషి చేస్తానన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. కళాశాల యాజమాన్యం ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేయగా మార్చి నెలలో మూడు రోజుల పాటు కళాశాలలో ఎన్‌బీఏ బృందం పర్యటించింది. కళాశాలలో బోధన, విద్యా ప్రమాణాలు, వసతులను పరిశీలించి మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుకు మూడేళ్ల పాటు గుర్తింపు ఇస్తూ మెయిల్ ద్వారా సమాచారం అందించినట్లు ప్రిన్సిపాల్ పి.జానకిదేవి తెలిపారు. ఇది వరకే కళాశాలకు ఐఎస్‌ఓ గుర్తింపు ఉండగా మొదటి సారిగా ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. దీంతో కళాశాలకు క్యాంపస్ సెలక్షన్లు, రీసెర్చ్ ప్రాజెక్టులు, నిధులు మంజూరు అవుతాయన్నారు. గుర్తింపుతో విద్యార్థులకు మెరుగైన వసతులు సమకూరనున్నాయన్నారు. త్వరలో కళాశాలలోని ఈఈఈ, సివిల్, సీఎస్‌సీ కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపునకు దరఖాస్తు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నల్లగొండ, నాగార్జునసాగర్‌లో పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా నల్లగొండ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడం పట్ల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురంలో కొలువైన శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 30న నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయన వెంట ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణాచారి, గాదె మహేష్, ఆలయ అధికారి జినుకుంట్ల చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి తదితరులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయి బిల్లులు, గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు గౌరవ వేతనం రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో కరీమున్నీసా, పోలె సత్యనారాయణ, సైదమ్మ, దొడ్డి అండాలు, ఏకుల మహేశ్వరీ, బొజ్జ అలివేలు, పద్మ, సత్తమ్మ, వెంకటమ్మ, రేణుక, స్వప్న, కొలస్య పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

యూటీఎఫ్ సంఘీభావ ర్యాలీ

రామగిరి(నల్లగొండ): ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిపార్కు వద్ద ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ నల్లగొండలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీ చేపట్టింది. ర్యాలీలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎడ్ల సైదులు, పి.వెంకటేశం, రామలింగయ్య, నరసింహ, రమాదేవి, వెంకన్న, మురళయ్య, సైదులు, రాకేష్, అంజిరెడ్డి, సంధ్య తదితరులున్నారు.

ఏఎంఆర్‌పీ కాలువ విస్తరణ!

ఏకేబీఆర్ నుంచి పానగల్ వరకు వెడల్పు కానున్న ప్రధాన కాలువ
- సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా విన్నవించిన నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- కాలువ సామర్థ్యం పెంపునకు సీఎం అంగీకారం.. సర్వేకు ఆదేశం
- దాదాపు 93 కిలోమీటర్ల పొడవున కాలువ విస్తరణకు అవకాశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎంఆర్‌పీ) ప్రధాన కాలువ విస్తరణకు అడుగులు పడుతున్నాయి. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) నుంచి పానగల్ ఉదయ సముద్రం వరకు ఉన్న కాలువ వెడల్పుపై ప్రభుత్వం దృష్టి సారించింది. వచ్చే రెండు మూడేళ్లలో శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పూర్తయితే గ్రావిటీ ద్వారా అక్కడి నుంచి వచ్చే నీరు ఏకేబీఆర్ కాలువకు చేరనుంది. ప్రస్తుతం ఏకేబీఆర్ నుంచి ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువ ద్వారా నల్లగొండలో ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు వస్తున్నాయి. భవిష్యత్తులో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే ఏకేబీఆర్ నుంచి పానగల్ ఉదయ సముద్రం వరకు ఉన్న ప్రధాన కాలువ ద్వారా నీటి సరఫరా సామర్థ్యం పెరుగుతుంది. అందుకు కాలువ విస్తరణ తప్పనిసరి కానుంది. ఇదే అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రజాప్రతినిధుల సమావేశంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తీసుకెళ్లారు. ఆ వివరాలను సమగ్రంగా తెలియజేయడంతో సీఎం సానుకూలంగా స్పందించారు. వెంటనే సర్వేకు సంబంధించి సీఎం కార్యాలయ అధికారులకు ఆదేశాలిచ్చారు.



పీఏపల్లి పరిధిలోని ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువ

భవిష్యత్తు అవసరాల కోసమే..
ఇప్పటికిప్పుడు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. టీబీఎం(టన్నెల్ బోర్ మిషన్)లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సొరంగం పనులు కొనసాగుతున్నాయి. వచ్చే రెండు మూడేళ్లలోనైనా టన్నెల్ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అది పూర్తయితే గ్రావిటీ ద్వారానే ప్రధాన కాలువకు నీటి సరఫరా జరుగనుంది. ఈ నేపథ్యంలో టన్నెల్ పనులకు ఎన్నిరోజులు పట్టినా ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువ విస్తరణ తప్పనిసరి అని తెలుస్తోంది. అందుకే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వివరించారు. కాలువ విస్తరణ, లైనింగ్‌కు సంబంధించిన సర్వేకు అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. ఆ పనులతోపాటు భూసేకరణకు దాదాపు రూ.1200 కోట్లు అవసరం అవుతాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగర్ బ్యాక్ వాటర్ నుంచి లెక్కిస్తే ఈ ప్రధాన కాలువ ఏఎంఆర్‌పీ కింద 23వ కిలోమీటర్ నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడి నుంచి 100వ కిలోమీటర్ వద్ద ఉన్న ఉదయసముద్రంకు కృష్ణాజలాలు చేరుతున్నాయి. ఇది మొత్తం 77 కిలోమీటర్ల పొడవు ఉండగా, ఉదయసముద్రం తరువాత కాలువ ఉన్న మరో 36 కిలోమీటర్ల పొడవులో 16కిలోమీటర్ల వరకు మొత్తంగా 93 కిలోమీటర్ల పొడవున వెడల్పునకు అవకాశం ఉంది.

టన్నెల్ పూర్తయితే..
ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే దానినుంచి నక్కల గండి రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారానే నీరు వస్తుంది. అక్కడి నుంచి మరో టన్నెల్ ద్వారా పెండ్లిపాకల రిజర్వాయర్‌కు నీళ్లు వస్తాయి. అక్కడి నుంచి 24 కిలోమీటర్లు ఎస్‌ఎల్‌బీసీ ఓపెన్ కాలువ ద్వారా వచ్చే నీరు ఏకేబీఆర్ ప్రధాన కాలువ 24వ కిలోమీటర్ కామన్ పాయింట్ వద్ద కలుస్తాయి. ఈ కాలువకు సంబంధించి పీఏపల్లి మండలం కేంద్రానికి సమీపంలో పది కిలోమీటర్లు పనులు చేపట్టాల్సి ఉంది. వాటి భూసేకరణ పనులు చాలా రోజుల కిందట ఆగిపోయాయి. ప్రస్తుతం వాటిల్లోనూ కదలిక వచ్చింది. నీటి పారుదల శాఖ అధికారులు ఇటీవలే ఆ కాలువలకు అవసరమైన భూసేకరణపై దృష్టి పెట్టారు. వాటికి సంబంధించి గ్రామస్తులతోనూ సమావేశం నిర్వహించారు.

మూడు వేల క్యూసెక్కులకు పైగా నీటి సరఫరా
ప్రస్తుతం ఏఎంఆర్‌పీ కాలువ ద్వారా ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు 1,300 క్యూసెక్కుల నీటి సరఫరా జరుగుతోంది. కాలువల విస్తరణ, లైనింగ్ పనులను చేపడితే నీటి సరఫరా సామర్థ్యం రెట్టింపవుతుంది. 3 వేల క్యూసెక్కులకుపైగా నీటి సరఫరా జరిగే అవకాశం ఉంది. అంతేకాదు ఏఎంఆర్‌పీ కింద ఉన్న 40కి పైగా మేజర్ డిస్ట్రిబ్యూటరీల ద్వారా నల్లగొండ జిల్లాలోని వివిధ మండలాలకు నీటి సరఫరా సామర్థ్యం కూడా పెరుగనుంది.

ధాన్యం కొనుగోళ్లలో మొదటి స్థానం

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టౌన్: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇందుకు అధికారులందరినీ అభినందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని జెడ్పీ కార్యాలయంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన సభలో తొలుత మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి, పీఏపల్లి జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణి మాట్లాడుతూ తమ మండలాల్లో ధాన్యం కొనుగోలు, తరలింపు విషయంలో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, దీంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఏమైన సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యేలతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, నిరాధారమైన ఆరోపణలు సభలో చేయొద్దని సభ్యులకు మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు పోతేనే రైతులు వెంటపడ్డారని శోభారాణి అనడంతో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ జోక్యం చేసుకుని స్థాయి మరిచి మాట్లాడితే బాగుండదని, హైదరాబాద్‌లో ఉంటూ రాజకీయం చేస్తుందని ఆరోపించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టి ఆరోపణలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య మాట్లాడుతూ సభలో ఇప్పటి వరకు సభ్యులు పార్టీల గురించి మాట్లాడలేదని, ఎందుకు పార్టీల ప్రస్తావన తెస్తున్నారని అనడంతో మంత్రి స్పందించి దీన్ని రాజకీయం చేయడం తగదని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్, కలెక్టర్, సీఈఓ

6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం..
అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అన్నారు. కొన్ని మీడియా సంస్థలు అభివృద్ధి ఇష్టం లేక తప్పుడు కథనాలు రాస్తుంటాయని, ప్రతి మీడియాకు ఒక పొలిటికల్ ఎజెండా ఉంటుందన్నారు. అలాంటి వార్తలు రాసే వాటిని పట్టించుకోబోమన్నారు. మే మాసాంతానికి వానాకాలం పంట, నవంబర్ చివరికి యాసంగి వరినాట్లు పూర్తి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో మార్చి చివరినాటికే ధాన్యం కొనుగోలు పూర్తవుతాయని, అనంతరం వర్షాలు వచ్చినా రైతాంగానికి ఎలాంటి నష్టం జరగదన్నారు. పంటల సాగును ముందుకు తీసుకుని రావాలని రైతులకు విజ్ఞప్తి చేస్తూ వ్యవసాయ శాఖ ప్రతిపాదించిన తీర్మానాన్ని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి సభలో ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రకుమార్, నోముల భగత్, వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.



హాజరైన ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని సువర్ణమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన గావించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ షాపుల్లో రెండు రశీదులు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న బియ్యం కోటా తెలుపుతూ ఆన్‌లైన్‌లో జారీ
- ఎవరెంత రాయితీ భరిస్తున్నారో స్పష్టమైన వివరాలతో ముద్రణ
- అమలులోకి వచ్చిన ప్రక్రియ

నల్లగొండ: చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులు పొందే బియ్యానికి సంబంధించి డీలర్లు రెండు రశీదులు ఇస్తున్నారు. ఈ విధానం ఈ నెల నుంచే ప్రారంభమైంది. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా ఎన్ని కిలోల చొప్పున ఇస్తున్నాయి. ఎంత సబ్సిడీని భరిస్తున్నాయనే విషయాలను తెలుపుతూ రేషన్ షాపుల్లో డీలర్లు కార్డుదారులకు వేర్వేరుగా ఆన్‌లైన్ రశీదులు ఇస్తున్నారు. పేదలకు ఇచ్చే బియ్యంలో ఎవరి వాటా ఎంత అనేది స్పష్టంగా తెలియజేడానికే రెండు రశీదుల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

రేషన్ షాపులు 991..
జిల్లాలో మొత్తం 991 రేషన్ షాపులు ఉండగా వీటి పరిధిలో కార్డుదారులందరికీ ప్రతినెలా బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇప్పటివరకు వేలిముద్రలు, ఐరిష్ పద్ధతుల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ వచ్చారు. ఈ సమయంలో ఎన్ని కేజీల బియ్యం ఇస్తున్నారన్నదానికి సంబంధించి ఒక రశీదు మాత్రమే ఇస్తున్నారు. తాజాగా కేంద్రం, రాష్ట్రం వాటా తెలుపుతూ వేర్వేరుగా రెండు రశీదులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించారు.

కేంద్ర, రాష్ట్రాల వాటా ఇలా..
జిల్లాలో 4,66,570 కార్డులు ఉంటే అందులో 3,13,461 కేంద్రానివి, 1,53,109 కార్డులు రాష్ట్రానివి ఉన్నాయి. ఈ కార్డులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక్కో కార్డులోని ఒక్కో వ్యక్తికి 5 కిలోల చొప్పున బియ్యం ఇస్తుండగా రాష్ట్రం అదనంగా మరో కిలో కలిపి ఆరు కిలోలను ప్రతినెలా అందజేస్తోంది. అయితే కేంద్రం ఇచ్చే ఐదు కిలోలకు సంబంధించి కిలోకు 38.07 పైసలు సబ్సిడీ భరిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 38.18 పైసలు భరిస్తుంది.




రాష్ట్ర ప్రభుత్వం పేరిట వచ్చిన ఆన్‌లైన్ రశీదు



కేంద్ర ప్రభుత్వం వాటా తెలుపుతున్న రశీదు

కేంద్రం వాటాను తెలిపేందుకే రశీదులు..
పేదలకు ఇచ్చే బియ్యం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా ఇస్తుందన్న ప్రచారం ప్రజల్లో ఉండటంతో కేంద్రం ప్రభుత్వం తాము ఇచ్చే వాటా ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఈ రెండు రశీదుల విధానాన్ని తీసుకొచ్చింది. రశీదులు ఇవ్వడం ద్వారా రేషన్ బియ్యంపై ఎవరెంత సబ్సిడీ ఇస్తున్నారన్న దానిపై ప్రజలకు తెలియపర్చవచ్చని ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రక్రియ ప్రారంభించాం



కార్డుదారుడు బియ్యం తీసుకున్న వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు తెలియజేస్తూ రశీదులు వస్తాయి. ఆయా రశీదుల్లో ఎవరి వాటా, సబ్సిడీ ఎంత భరిస్తున్నారన్నది ముద్రించి ఉంటుంది. రెండు రశీదుల ప్రక్రియ ఈనెల నుంచే ప్రారంభించాం.
– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ, నల్లగొండ

సమరయోధులుగా గుర్తించాలి

భానుపురి (సూర్యాపేట): 1969 తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 1969 తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి గౌరవ ప్రదమైన పెన్షన్ ఇవ్వడంతోపాటు ఉచిత బస్‌పాస్, హెల్త్ కార్డ్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారాంరెడ్డి, జిల్లా కోశాధికారి చంద్రారెడ్డి వెంకటయ్య, దేవత్ కిషన్ నాయక్, కొత్త గురువయ్య పాల్గొన్నారు.

7.99 లక్షల మందికి కంటి పరీక్షలు

- నాలుగు నెలలుగా సాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం
- ఇప్పటికే 819 పంచాయతీలు, 180 మున్సిపల్ వార్డుల్లో శిబిరాలు పూర్తి
- అవసరమైన వారికి రీడింగ్, ప్రిస్క్రిప్షన్ అద్దాల అందజేత
- మరో వారం రోజుల్లో పూర్తి కానున్నట్టు అధికారుల వెల్లడి

నల్లగొండ టౌన్ : పేదలు దృష్టి లోపంతో బాధ పడకూడదన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 7,99,438 మందికి కంటి పరీక్షలు పూర్తి చేశారు. అందులో 1,08,520 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. 83,009 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వైద్యశాఖ ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టింది. వచ్చిన అద్దాల్లో ఇప్పటి వరకు 65,295 మందికి అందజేసింది. జిల్లాలోని 844 గ్రామపంచాయతీలు, అన్ని మున్సిపాలిటీల్లోని 182 వార్డుల్లో 18 ఏళ్లు నిండిన వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటికి 819 గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లోని 180 వార్డుల్లో కంటి పరీక్షల శిబిరాలు పూర్తయ్యాయి. మిగిలిన చోట మరో వారంలోగా శిబిరాలను నిర్వహించి నూటికి నూరుశాతం కంటి పరీక్షలు పూర్తి చేసేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందుకు సాగుతోంది.



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జనవరి 19న ప్రారంభించి..
జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ఈ ఏడాది జనవరి 19న ప్రారంభించారు. ఇందుకు గాను 74 బృందాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలు, ఇతర ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగతా అన్ని రోజుల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాలుగు నెలలకుపైగా ఒక మహోద్యమంలా సాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం మరో వారం రోజుల్లో పూర్తి కానుంది.

ప్రజల నుంచి అనూహ్య స్పందన
కంటివెలుగు శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య కనిపించింది. పట్టణాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలంటే రూ.రెండు మూడు వేల వరకు ఖర్చవుతుంది. 40 ఏళ్లపై బడిన వారు పెద్ద ఎత్తున కంటి పరీక్షలు చేయించుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెతున్నాయి. ప్రభుత్వం నియమించిన బృందాలు గ్రామాలు, వార్డుల్లోనే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉంటే వారికి ఉచితంగా అద్దాలను అందజేస్తున్నాయి. ఎండలు తీవ్రత ఉన్నా.. ఆయా బృందాలు వారికి కేటాయించిన గ్రామాలు, వార్డులకు వెళ్లి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాయి. అయితే, పరీక్షల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరాల వద్ద తాగు నీటి సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతోంది.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే 819 గ్రామపంచాయతీలు, 180 మున్సిపల్ వార్డుల్లో పరీక్షలను చేయడం పూర్తి కావొచ్చింది. మిగిలిన గ్రామపంచాయతీలు, వార్డుల్లో వారం రోజుల్లో పూర్తి చేసి నూటికి నూరుశాతం లక్ష్యం చేరుకుంటాం. ఉచితంగా పరీక్షలు చేసి అద్దాలు అందజేస్తున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

పూలే, అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

కనగల్: నేటి యువత.. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి వారి ఆశయాలను సాధించాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కనగల్ మండల పరిధిలోని దోరెపల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పూలే, అంబేడ్కర్ విగ్రహాలను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ బహుజన రాజ్యస్థాపన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి రాజ్యాంగా హక్కు అన్నారు. అంబేడ్కర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. రాజకీయ వేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగా నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికి నిలిచిపోయే మహనీయుడు బాబాసాహెబ్ అని కొనియాడారు. సామాజిక స్వేచ్ఛను సాధించనంత కాలం, చట్టం ద్వారా ఏ స్వేచ్ఛను అందించినా ప్రయోజనముండదని అంబేడ్కరే చెప్పారని గుర్తు చేశారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటి సభ్యుడు తమకు తోచినంత చేయుతనిచ్చి గ్రామం మొత్తం భాగస్వామ్యం కావడం చాలా అభినందనీయమన్నారు. అంతకు ముందు నల్లగొండ పట్టణం నుంచి దోరెపల్లి వరకు భారీ ర్యాలీతో ఇక్కడకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, స్థానిక సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్, కిన్నెర శ్రీనివాస్, దాసరి యాదగిరి, ఏమిరెడ్డి రవీందర్‌రెడ్డి విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు దాసరి యాదగిరి, లింగస్వామి, విజయ్, నర్సింహ, బాలకృష్ణ, కాశీం, బాలరాజు, కళ్యాణ్, స్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న విశారదన్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

క్లుప్తంగా

రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 31 ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం)ను అధిష్టానం ఏర్పాటు చేసిందని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్‌డీఎం ప్రోగ్రాం రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుంగతుర్తి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో ఎల్‌డీఎం ప్రోగ్రాంపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని అన్నారు. దళిత నియోజకవర్గాల్లో పార్టీని విస్తృతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను సమన్వయం చేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందని, అవినీతి ఏరులై పారుతుందని విమర్శించారు.సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాల లక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ అమరవరపు శ్రీనివాస్, మైనార్టీ సెల్ చైర్మన్ నిజామోద్దిన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, సీనియర్ నాయకులు అన్నెపర్తి జ్ఞాన సుందర్, ఇటికాల చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ , మండలాల, అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మోతె ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి


మోతె పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- సీపీఎం నాయకురాలు మల్లు లక్ష్మి డిమాండ్
- పార్టీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన

మోతె : పేదల పక్షాన శాంతియుతంగా పోరాడుతున్న సీపీఎం నాయకులు, మహిళా కార్యకర్తలపై దాడి చేసిన మోతె ఎస్ఐ మహేష్‌ను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. మోతె మండల పరిధిలోని విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్‌రెడ్డితో పాటు మహిళా కార్యకర్తలపై మోతె ఎస్ఐ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాడులు చేయడం ఎంత వరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. న్యాయం చేయాలని పేదలు ఆందోళన చేస్తున్నా కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేసులకు భయపడేది లేదని, పేదలకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, ముల్కలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, నాగం మల్లయ్య, కిన్నెర పోతయ్య, కుంచం గోపి, వెలుగు మధు, సోమగాని మల్లయ్య, పెరుమళ్ల నాగమణి, కల్లెపల్లి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ యువతకు ఉపయోగం


స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేలు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్ నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలోని డీపీఆర్‌సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అధ్యయన కేంద్రంగా సెంటర్‌ను తీర్చిదిద్దాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యర్థులకు కోచింగ్‌ల ఖర్చుభారం తగ్గించాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో గ్రంథాలయాలను విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- అపార్ట్‌మెంట్ పైనుంచి పడడంతో మృత్యువాత
- మృతురాలు మిర్యాలగూడలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తింపు
- కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు


శోభ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల వైష్ణవి అపార్టుమెంట్‌పై నుంచి ఓ యువతి పడడంతో స్థానికులు గుర్తించి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఏరియా ఆస్పత్రికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు యువతి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. సదరు యువతి పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తించారు. చికిత్స అందిస్తుడగానే యువతి మృతిచెందింది. దీంతో డీఎస్పీ వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. యువతి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన పోలీసులు తెలిపారు.

అనుమానాలెన్నో..

శోభ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అపార్ట్‌మెంట్ మెత్తం సీసీ పుటేజీ నిఘాలో ఉండటంతో పాటు నిత్యం వాచ్‌మన్ డ్యూటీలోనే ఉంటాడు. కొత్తవారు ఎవరు వచ్చినా లోనికి వెళ్లే పరిస్థితి ఉండదు. కాగా మృతురాలు శోభ గతంలో ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేసిందని సమాచారం. ఆ యువతి అపార్ట్‌మెంట్‌కు ఎందుకు వెళ్లింది?, అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవాశాత్తు పడిందా..? లేకా ఎవరైనా కావాలని తోశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తే యువతి మృతిపై మిస్టరీ వీడనుంది.

చౌటుప్పల్‌లో వ్యక్తి..

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 9వ వార్డు పరిధి చిన్నకొండూర్ రోడ్డులో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బత్తుల యాదగిరి–రాజమణి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నకుమారుడైన బత్తుల నరేందర్(38) చేనేత వృత్తితోపాటు గ్లాస్ ఫిటింగ్, ప్లై ఉడ్ వర్క్ చేస్తుంటాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను పట్టణంలోని తంగడపల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన స్నేహితుడికి సంబంధించిన వివాహానికి హాజరైనట్లుగా తెలిసింది. మధ్యాహ్నం తర్వాత ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణలో చేనేత పని చేసుకుంటున్న తల్లి అతన్ని చూసింది. ఎక్కడికి వెళ్లి వస్తున్నావు, భోజనం చేశావా అని అడిగింది. తాను భోజనం చేశానని చెప్పి ఇంట్లోకి వెళ్లి ప్యాంటు, షర్టు విప్పేసి షాట్ ధరించి బెడ్రూంలో పడుకున్నాడు. ఆ క్రమంలో లోపలికి వెళ్లిన వ్యక్తి చాలాసేపటి వరకు కూడా బయటకు రాకపోవడంతో వదిన సత్యలక్ష్మి రాత్రి 7గంటల ప్రాంతంలో బెడ్రూంలోపలికి వెళ్లి చూసింది. అప్పటికే కదలికలు లేకపోవడంతో కుటుంబ సభ్యులను పిలిచింది. వారంతా పరిశీలించగా చనిపోయినట్టుగా నిర్ధారించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సైదులు ఘటనా స్థలానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. శరీరంపై పలు చోట్ల గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టడంతో ఇలా జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

దేవరకొండ: గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కొప్పోల్ గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య కుమార్తె నల్లగొండలో చదువుతున్న క్రమంలో కట్టంగూర్ మండలం దుగినేపల్లికి చెందిన బొడ్డు సంతోష్(18)తో పరిచయం ఏర్పడి అదికాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు మూడు నెలల క్రితం షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేసి కౌన్సిలింగ్ ఇప్పించారు. వారిలో మార్పు రాకపోవడంతో పాటు వారిరువురు ఫోన్‌లో తరుచూ మాట్లాడుకుంటున్నారు.ఈ క్రమంలోనే ఈనెల 25న సంతోష్ అమ్మాయి స్వగ్రామమైన కొప్పోల్‌కు వచ్చాడు. ఎవరూ లేని సమయంలో అమ్మాయి ఇంట్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కూలికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన అమ్మాయి తండ్రి మల్లయ్య వారిని చూసి కోపోద్రిక్తుడయ్యాడు. వెంటనే తమ సమీప బంధువైన ఆవుల నగేష్‌తో పాటు తన తల్లి రాములమ్మను పిలిచి రోకలి బండలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాసులు,ఎస్ఐ శివప్రసాద్, తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


బాలుర విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న మేడ్చల్ మల్కాజిగిరి జట్టు

- ముగిసిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ యూత్‌చాంపియన్ షిప్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ బడుగుల

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడాకారులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమలోని ప్రతిభను మెరుగుపరుచుకొని రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. గతంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించిన ఘనత రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ సీఈవో సురేష్, క్రీడల అధికారి వెంకటరెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ భిక్షం, ఆజంబాబు పాల్గొన్నారు.


బాలికల విభాగంలో రెండో బహుమతి అందుకుంటున్న అందుకుంటున్న ములుగు జట్టు

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా ఆయా జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్ జిల్లాలు కైవసం చేసుకున్నారు.

ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళన

- వైద్యం వికటించి మహిళ మృతిచెందిందని బంధువుల ఆరోపణ


కమలమ్మ (ఫైల్)

కొండమల్లేపల్లి : వైద్యం వికటించి మహిళ మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం స్థానిక ఓ ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని స్థానిక సంఘం బజారు–2లో నూనె ఆశీర్వాదం, కమలమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న కమలమ్మ(65) అనారోగ్యానికి గురికావడంతో స్థానిక నల్లగొండ రోడ్డులోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఎంపీ ఆంజనేయులు ఇంటికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. సదరు ఆర్ఎంపీ గ్లూకోజ్ బాటిల్ పెట్టి ప్రథమ చికిత్స చేశాడు. ఈ క్రమంలోనే కమలమ్మ నోటి నుంచి గురక వస్తుండడంతో భయపడిన కుటుంబ సభ్యులు ఆమెను దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె పరిస్థితి విషమించింది. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఈనెల 24న చికిత్స పొందుతూ కమలమ్మ మృతిచెందింది. అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, కమలమ్మ మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు ఆరా తీయగా మొదటి రోజు ప్రథమ చికిత్స సమయంలో జరిగిన పొరపాటు వల్లనే మృతిచెందిందని ఆరోపిస్తూ వైద్యశాల వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు ఆర్ఎంపీపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మన్ మృతి


వేణుకుమార్‌రెడ్డి (ఫైల్)

హాలియా : రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మన్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన అలీనగర్ సమీపంలో హాలియా–నల్లగొండ జాతీయ రహదారిలో ఇటుకబట్టీల వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్లు మండలం దేవవారిగూడెం గ్రామానికి చెందిన దేప వేణుకుమార్‌రెడ్డి (37) నల్లగొండలో విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన విధుల నిమిత్తం దేప వేణుకుమార్ రెడ్డి మోటర్ బైక్‌పై నల్లగొండ నుంచి హాలియాకు వచ్చాడు. పనులు ముగించుకున్న వేణుకుమార్‌రెడ్డి బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో హాలియా–నల్లగొండ జాతీయ రహదారిలోని అలీనగర్ సమీపంలోని ఇటుకబట్టీల వద్ద రోడ్డుకు అడ్డంగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుకుమార్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో రోడ్డు మార్గం గుండా వెళ్లే వాహన దారులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం వాహనంలో బాధితుడిని నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే వేణుకుమార్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి సోదరుడు దేప రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

హుజూర్‌నగర్ : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్త పులిచింతల వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శనివారం హుజూర్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో తమ్మినేని వీరభద్రం పాల్గొని వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. దేశంలో కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల నడుమ తాత్కాలికంగా కొంతమేర బలహీనపడ్డ చివరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని ఆయన పేర్కొన్నారు. కార్యమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు నంద్యాల నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు ఎన్ పాండు, ఎన్.వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, పి.వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, యాకోబ్, రవి, శ్రీరాములు, పి.శేఖర్‌రావు, హుస్సేన్, శీలం శ్రీను, త్రివేణి పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల సంతాపం

పట్టణానికి చెందిన బీఆర్ఎస్, సీపీఐ, న్యూడెమోక్రసీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు అఖిల పక్ష నాయకులు వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్యపద్మ, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, ఒక్కవంతుల కోటేశ్వరరావు, యలక వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో కొత్తగా డిగ్రీ కోర్సులు


హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న 'దోస్త్' కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాల నందు 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) కోర్సులు ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్జీ కళాశాలలో 1620 సీట్లు ఉండగా అందులో బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 360, లైఫ్ సైన్స్‌లో 360, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్ అండ్ టాక్సేషన్స్‌లో 420, బీఏ 240, బీబీఏలో 120, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్‌లో 60, బీసీఏలో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు www.dost.cgg.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకొని, కోర్సులకు వెబ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

దోస్త్ 2023 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఎన్జీ కళాశాల నందు శనివారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'దోస్త్' కోఆర్డి నేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ దోస్త్ రిజిస్ట్రేషన్ నందు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎన్జీ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ సిబ్బంది వారి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

గరిష్ట నీటిమట్టానికి అడుగు దూరంలో..


నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

- నిండుకుండలా మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి కేవలం ఒకే ఒక దూరంలో ఉంది. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నెల రోజుల నుంచి మూసీలోకి ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది శనివారం ఎగువ నుండి మూసీకి 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు కాగా శనివారం సాంత్రానికి 643.50 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. కేవలం అడుగు నీరు చేరితే ప్రాజెక్టు గేట్లు పైకెత్తే అవకాశముంది. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.